కన్యాచెఱి

★

శ్రీ వెంపటి సచ్చిదానందశర్మ

పాపాయిలూ! గుట్టు చప్పుడు కాకుండా లోలోపల గుంజాటనపడి ప్రయోజన మేమీ లేదు; వెన్ను విరిచి 'ఇది జరగా'లని చెప్పండి—వీలు చూసి సుమీ! సీనయ్య పెదనాన్న లాటి వాడికే—వాడి పుణ్యమా, అని...రామనాథం వేళ్ళుమడిచి తర్జనితో దారి చూపించబోయేదాకా—కర్తవ్యం బోధపడకపోయె! రామలక్ష్మి సిగ్గుపడిందేమో అనుకో వచ్చు, మీరు. సీతాపతి ఐనా, నేరస్థుడిలాగ పెడ పెడగా తిరక్కపోతే 'నాన్నా! నాకిది కావా'లని జాలు అందివ్వకూడదూ?—

అందిస్తే, వదినగారితో ఈ 'కన్యాదానం' ఎప్పుడో జరిగిపోయేది! కన్యాదానాన్ని రెండు మూళ్ళ ఆరు ముళ్ళతో బిగించట మేమిటని విడ్డూరంగా మూతిమీద వేలు వేసుకుని లాభంలేదు. దీనికంతకూ సంధానకర్త గౌరవం, రామనాథానికి ఎలా దక్కిందో కూడా మనవిచేస్తా—

రామనాథం ఒకనాటి నిశరాత్రివేళ విసవిసా తన గదిలోకి వచ్చి లెటర్ పాడ్ తెరిచి దీపంముందు కూర్చున్నాడు. రామలక్ష్మి, సీతాపతుల ప్రవర్తనను గురించి తను కాగితంమీద పెట్టాలనుకున్న విషయాలన్నీ అతని మనస్సులోనుంచి బయటికి రావాలని ఒక్కపెట్టున ఉరకలువేస్తూ కలం నడవకుండా చేస్తున్నై.

"పెద్దనాన్నగారికి,—నాఉత్తరం మీకు కష్టం కలిగిస్తే దానికి కారణం అందులో వ్రాసిన విషయ స్వభావమేనని భావిస్తారనీ, ఒకవేళ నేను కళ్లారా చూచి చెవులార విని మీ దిద్దుబాటుకోసం యథార్థాన్ని బయటపెట్టటంలో నా తప్పేమైనా ఉంటే క్షమిస్తారనే నమ్ముతూ ఈ ఉత్తరం వ్రాస్తున్నాను." —అంటూ ఒళ్ళు తెలీని ఆవేశంతో ఒక పెద్ద ఉత్తరాన్ని తయారుచేశాడు.

ఉత్తరం మడుస్తూ గడియారంవైపు చూచేసరికి భళ్ళున రెండుగంటలు చూపిస్తోంది చిన్నముల్లు. బల్లమీది పుస్తకంకింద ఉత్తరాన్నుంచి పక్కమీదికి చేరాడు రామనాథం. కంటిమీదికి కునుకువచ్చే సూచనలు ఏమాత్రంలేవు. కనీసం నిద్రపోవటానికి ప్రయత్నం చెయ్యటంకూడా అనవసర మనిపించింది రామనాథానికి.

పక్కమీద పడుకుని గతమంతా తిరగదోడుకుంటున్న రామనాథాన్ని ఇప్పుడు కదిలిస్తే అంటాడు—నేను ఆ యింట్లో అడుగుపెట్టిన మరుక్షణంలోనే పసికట్టాను రహస్యమంతా—అని.

సరే, ఇందులో కొంత అతిశయోక్తి ఉంటుందనుకోండి—

యాతావాతా—ఎలాగైనా ఈ ఉత్తరం సీనయ్యగారికి అందజేసి తనుమరీ రైలెక్కాలనుకున్నాడు. దీనివల్ల రాబోయే పరిణామ మేమిటని పరిపరివిధాల ఆలోచించాడు రామనాథం. కాలేజీలో చేరటానికి వచ్చిన ఆనాటినుంచీ శలవలకి ఇంటికి వెళ్లటానికి తయారవుతున్న ఈనాటి వరకు ఈ ఇంట్లో గడిచిన తన జీవితమంతా తెరమీది బొమ్మల్లాగా వద్దనుకున్నా కళ్లకు కడుతోంది.

కాలేజీలు తెరవగానే, ఒక శుభోదయాన తండ్రి చాటున అడుగుల్లో అడుగువేసుకుంటూ సీనయ్యగారింటికి నడిచాడు రామనాథం.

పరీక్ష ఫలితాలు తెలిసినప్పటినుంచీ ఇంటర్మీడియెట్ గండం గడిచి బియ్యేలో చేరబోతున్నానన్న గర్వంతో రామనాథం మనస్సు కలవర పడ్డది. కాస్సేపు ఆ విషయం మరిచి ప్రశాంతంగా ఉందామంటే వాడి శక్యంకాకపోయింది.

పరీక్ష అవటమంటూ ఉంటే హాయిగా, ఒంటరిగా హాస్టల్లో ఉంటూ బియ్యే చదువు సాగిద్దామనుకున్నాడు రామనాథం. కాని, తండ్రి అది పడనిచ్చాడు కాదు. ముక్కుకి తాడుపోసినట్టు లాక్కొచ్చాడు సీనయ్యగారింట దిగ విడిచిపోవటానికి.

సీనయ్యగారింట అడుగుపెట్టగానే రామనాథం ఉబలాటం ఇంకా దెబ్బ తింది.

సీనయ్యగారిది కలిగిన కుటుంబం—మహాలక్ష్మిలాంటిభార్య యశోదమ్మ, ఇంటర్మీడియేట్ పరీక్షకి వెళ్లబోతున్న కొడుకు సీతాపతి, బియ్యేచదువుతున్న కోడలు—అంతా పెద్ద ఎత్తులో వ్యవహారం.

స్వగృహమైన తన పూరిపాకలో మిరుమిట్లు గొలిపిన తన బియ్యే, సీనయ్యగారి మేడలో వెలా తెలా పోతున్నట్లనిపించింది రామనాథానికి.

దీనికి తోడు, ఎదటివాళ్ళు తబ్బిబ్బయేటంత ఆదరణచూపించాడు సీనయ్యగారు. రామనాథానికి తండ్రి దార్లోనే చెప్పాడు—సీనయ్య తనకి బంధువుల్ని మించిన ఆప్తమిత్రుడని. తండ్రిమాటలు అక్షరాల నిజ మనిపించింది రామనాథానికి. ఆనూతన పరిసరాల్లో ప్రతి చిన్నవిషయం రామనాథంలో కుతూహలాన్ని రేకెత్తించింది. వెఱ్ఱిగా హాల్లో ఉన్న కుర్చీలు, బీరువాలకేసి చూడటం ప్రారంభించాడు.

మొదటి పరామర్శలయింతర్వాత, “ఒరేఅబ్బి! ఇప్పుడే చెప్తున్నాను. చెప్పల్లో కాళ్లెట్టు గోచ్చావంటే ఆపైన లాభంలేదు. రాకరాక వచ్చావు...... నిన్ను తేలిగ్గా వదల్ను!” అన్నాడు సీనయ్య, పడక కుర్చీలోనుంచి ముందుకి వంగి. వృద్ధాప్యంలోకి దొర్లుకుపోవటానికి సిద్ధంగా ఉన్న ఆ నడివయసులో సీనయ్య తన తండ్రితో అలా కులాసాగా మాట్లాడుతుంటే విన ముచ్చటగా వుంది రామనాథానికి.

“ముందరి కాళ్లకి బందమైతే వేశావు. బాగానే వుంది. మరి నేను చెప్పవలసిన సమాధానం కూడా విను...” అంటూ ఏదో సమాధానం చెప్పబోయాడు రామనాథం తండ్రి—నాలుగురోజుల తర్వాతకూడా సీనయ్యగారిని వదుల్చుకుని స్వగ్రామం చేరటం బ్రహ్మప్రళయమైంది ఆయనకి!—ఇది తరవాత విషయం అనుకోండి!

ఈ దృశ్యం ఇప్పటికి కూడా రామనాథానికి కళ్ళల్లో మెదులుతూ ఉంటుంది—ఇంతలో రామలక్ష్మి ప్రవేశించి, “లైటు వేసుకోవటం కూడా మరిచి మాట్లాడేస్తున్నారే!” అంటూ స్విచ్చినొక్కి జిగేలు మనిపించింది. ఎవరన్నట్లు చూచారు తండ్రి, కొడుకు లిద్దరూ.

“మా పెద్దవాడి భార్య—రామలక్ష్మి. పూర్వమే స్కూల్ ఫైనల్ పరీక్ష అయింది తెలుసుకదూ? వాడు పోయినదగ్గరనుంచీ ఇక్కడే ఉంచి చదువు చెప్పిస్తున్నాను. నిరుడు ఇంటర్మీడియేట్ పరీక్షయింది. ఈ ఏడు బియ్యేలో చేరింది.”

గుండె పగిలేటంత దారుణమైన విషయాన్ని చెబుతున్నప్పుడు కూడా సీనయ్యగారి ముఖంలో బాధ ఒక లిప్తపాటే కనిపించింది. అంతే! కష్టాల్ని ఖాతరు చెయ్యనట్టు అంతవిషాదాన్ని దిగమింగి నవ్వు ముఖం పైకి తెచ్చుకుంటూ సంభాషణ మార్చివేశాడు సీనయ్య.

సానుభూతి చూపించాలో, అవసరం లేదో తెలియక రామనాథం, తండ్రీ కళవళపడ్డారు.

ఎదటివాళ్ళకోసమన్నా—రామలక్ష్మి కూడా విచారపడుతున్నట్లు పైకి కనిపించటం లేదు! వీళ్లేదో విచిత్రమైన మనఃప్రవృత్తులు గలవాళ్ళనుకున్నాడు రామనాథం.

“రాముడూ! వీడే రామనాథం......వీడూ బియ్యేలో చేరటానికే వచ్చాడు” అన్నాడు సీనయ్య నిశ్శబ్దత భంగపరుస్తూ.

రామలక్ష్మి మామగారి మాటల్ని వదిలి, “నాకు ఆనర్సుకి సీటుఇచ్చినట్లు ఇవ్వాళే యూనివర్సిటీ నుంచి ఉత్తరం వచ్చింది మామయ్యా! మరో అవకాశ మేమీ లేకపోతేనేకాని, ఎందుకీ బియ్యే! నన్ను ఆనర్సుకి పంపు మామయ్యా!” అంది గోముగా.

రామనాథానికి తలకొట్టేసినట్టనిపించింది. ఎంత ఆనర్సుకి సీటువస్తే మాత్రం తను బియ్యేలో చేరటానికి వచ్చాడని తెలిసిన తరవాత కూడా బియ్యే అంటే అంత చులకనగా మాట్లాడినందుకు రామలక్ష్మి మీద చాలా కోపం వచ్చింది.

“జీతం కట్టేశావు కదమ్మాయ్! మునిగిపోయిందేముంది...ఎమ్మే చదువుదూగాని...ఐనా, బియ్యేమాత్రం ఏమంత పుచ్చిపోయిందా ఏమిటి?” అన్నాడు సీనయ్యగారు.

ఈ మాటలు రామనాథాన్ని ఏమాత్రం సంతృప్తిపర్చలేకపోయినై. బియ్యే తక్కువతనాన్ని గురించి వాళ్ళిద్దరూ అలా చిందులాడుతున్నట్లు

మాట్లాడుకోవటం మరింత బాధించింది రామనాథాన్ని.

ఇంతలో, సీతాపతి బాటు పుచ్చుకుని హాల్లో నుంచి చరచరా లోపలికి వెళ్లాడు. "వాణ్ణి తెలుసుగా! మా రెండోవాడు, సీతాపతి...ఈ ఏడు ఇంటర్మీడియేట్ పరీక్షకి వెడతాడు" అంటూ తెలియజెప్పాడు సీనయ్యగారు.

తరవాత, వెంటనే మాట్లాడతగ్గ విషయం దొరక్క అంతా ఒక క్షణంసేపు నిశ్శబ్దంగా గడిపారు.

"ఇంతకీ నేను చెప్పవచ్చినమాట అలానే ఉండిపోయింది—నీళ్ళగదిలో వేణ్ణీళ్లు సిద్ధంగా ఉన్నాయిట. స్నానాలకి లేవండి" అంది తృళ్ళిపడ్డట్టు.

తండ్రి ప్రోత్సాహంమీద రామనాథం స్నానానికి లేచాడు.

వెళ్ళిపోబోతున్న రామలక్ష్మితో సీనయ్యగారు "రాముడూ! కాస్తవీడికి నీళ్లగది చూపించుమరి...కొత్తాయె..." అన్నాడు.

ఇద్దరూ బయలుదేరారు.

సీనయ్యగారు స్త్రీవిద్య, వితంతు వివాహాల మీద సంభాషణ ప్రారంభించాడు. బాలవితంతువు లెవరూ ఇంట్లో లేనంత నదురు, బెదురు లేకండా సీనయ్యగారు మాట్లాడుతుంటే ఈ ఇంట్లో వ్యక్తుల తరహాలన్నీ విపరీతమైన వనుకున్నాడు రామనాథం.

లోపలి హాలుకి ఎదురుగా వున్న గదిచూపించి "అది మీ గది. మీసామాన్లు ఆగదిలోనే ఉన్నై." అంది రామలక్ష్మి. రామనాథం అంటాడు—ఈమాటలు రామలక్ష్మి కాన్వెంట్ స్కూల్ మేట్రిక్ లాగా అందిట!

రామనాథానికి మాట్లాడకండా ఉండటం ఇష్టంలేకపోయింది. "మీ గ్రూపు ఏమిటండీ?" అన్నాడు.

"హిస్టరీస్...మీది?"

"నాదీ అదే... అన్నాడు రామనాథం ఉత్సాహం మేమీ ప్రదర్శించకండా.

"నేను ఇంగ్లీష్ లిటరేచర్ కి మార్చేస్తాను... హిస్టరీస్ క్లాసు ఒకడస్టుబిన్!" అంది రామలక్ష్మి నిర్లక్ష్యంగా.

రామలక్ష్మి అకారణంగా తన మనస్సు నింతగా ఎందుకు బాధపెడుతుందో అర్థంకాక పోయింది రామనాథానికి. ఎదటివాళ్లని మరిచి కేవలం తన ఊహాలని బయటికి చెప్పటమే ఆ అమ్మాయి స్వభావమేమో ననుకున్నాడు.

"అసలు నే నెందుకు పరీక్ష అయ్యానా అనిపిస్తోంది! లేకపోతే మళ్లా ఇంటర్మీడియెట్ పరీక్షకి వెడుతూ ఉండేదాన్ని సీతాపతితోబాటు."

రామలక్ష్మి ఈ మాటలు తనని వినమని అంటోందో, లేక, స్వగత మో రామనాథానికి బోధపడకపోయింది. ఇప్పుడు, పడుకుని ఆలోచిస్తుంటే ఈ మాటల్లో రామనాథానికి కొండంత అర్థం స్ఫురిస్తోంది. కాని, అప్పట్లో తను చెప్పతగ్గ సమాధానం ఏమీ లేక ఊరుకున్నాడు.

రామనాథానికి నీళ్ళగది చూపించి రామలక్ష్మి వెళ్ళిపోయింది.

స్నానం చేస్తున్నాడేగాని రామనాథం మనస్సు ఎలాగో ఉంది. పరిసరాలతోబాటు ఈ నూతనవాతావరణంలో మనుష్యుల తీరుకూడా తన కపరిచితమైనదిగా వుండి మరింత కొత్త అనిపించింది. రెండు చెంబుల నీళ్ళు ఎలాగో దిమ్మరించుకుని బైటపడ్డాడు.

రామనాథం వసారాలోకి వచ్చేసరికి, సీతాపతి ఒక్కడూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు. రామనాథం వచ్చి అవతలగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. కొద్ది క్షణాలు ఇద్దరూ మాటా పలుకూ లేకండా గడిపారు.

సీతాపతి చాలా బిడియస్థు డనుకున్నాడు రామనాథం.

రామక్ష్మి హడావిడిగా వసారాలోకి వచ్చి, వాళ్ళిద్దరినీ ఒక క్షణం పరకాయించి, అలా కూర్చోటానికి కారణం కనిపెట్టినట్టు "మరిచాను! మిమ్మల్ని పరిచయం చెయ్యాలనుకుంటాను కదూ? 'సీతా! ఈయనే రామనాథంగారు. ఇక్కడవుండి బియ్యే చదవటానికి వచ్చారు." అని, రామనాథంతో "ఈయన మిస్టర్ సీతాపతి..." అంటూ, స్నేహంగా ఉండమని పరిచయవాక్యం పలికింది.

తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో ఇద్దరూ ఏదో మాట్లాడబోతున్నారు.

ఇంతలో, యశోదమ్మగారు, "రాముడూ! భోజనానికి పిల్చుకురమ్మని పంపితే, నువ్వు కూడా ఇక్కడే ఉండిపోయావా......వాళ్ళని పిల్చుకు రావటంపోయి!" అంటూ నిలబడ్డది వాళ్ళ మధ్య.

కొత్తస్నేహితు లిద్దరితో, "మాట్లాడుకోటానికి రెండేళ్ళు టైముంది. ముందు భోజనానికి లేవండి!" అని, "అదికాదత్తయ్యా! ఎవరన్నా పరిచయం చేస్తేనే కాని మాట్లాడుకోరాదని మూగనోముపట్టి కూచున్నారు ఈ దొరలు! అందుకని, పని చేసుకుని వాళ్ళిద్దరి మధ్య ఆ తెర తొలగించాను!" అంది రామలక్ష్మి యశోదమ్మగారితో లోపలికి వెళుతూ.

భోజనాలముందుకూడా రామలక్ష్మది అదేతీరు! యశోదమ్మగారు వడ్డిస్తూంటే "అత్తయ్యా! సీతాకి ఇది కావాలని అడగటంకూడా చేతకాదు. కనిపెట్టి వడ్డించాలి..." అంటూ వేళాకోళం చెయ్యటం మొదలుపెట్టింది, కొత్తవాళ్లు ఉన్నారనైనా గమనించకండా.

సీతాపతి సిగ్గుతో కుంచించుకుపోవటం మొదలు పెట్టాడు!

"రామనాథంగారి స్నేహంతో మన సీతాకి చొరవ అబ్బితే అబ్బవచ్చు..." అంది రామలక్ష్మి మళ్ళీ. రామనాథం గుండె గతుక్కుమంది.

యశోదమ్మగారు నెయ్యివడ్డిస్తూ నవ్వి "నువ్వు మరీను...ఎదటివాళ్లని మాటలతో హడలగొట్టేస్తుంది" అంది.

సీనయ్యగారు నవ్వి ఊరుకున్నాడు.

రామనాథానికి, తండ్రికి రామలక్ష్మి తీరు విడ్డూరంగా ఉన్నా కప్పిపుచ్చుకుంటున్నారు.

అప్పటినుంచి, ఈనాటివరకు...

సీనయ్యగారి కుటుంబంతో తన పరిచయం చాలా సన్నిహితమైంది—సీనయ్యగారు పెదనాన్న అయాడు. యశోదమ్మగారు తల్లికంటె ఆదరణ చూపిస్తూ దొడ్డమ్మ అయింది. సీతాపతి తనకి కూడా 'సీతా' అయాడు. రామలక్ష్మినిమాత్రం 'రామలక్ష్మీ!' అనే పిలుస్తున్నాడు; కాని, చాలా చనువుగా.

కేవలం యాధాలాభంగా ఉన్న సమయాల్లోనే గాక, ఏ విషయాన్ని గురించైనా తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడు కూడా ఏదో విధంగా రామలక్ష్మి తీరు, మాటలూ జ్ఞాపకం వచ్చేవి రామనాథానికి. ఆ అమ్మాయి ప్రవర్తనలో ఏదో రహస్యం ఇమిడి వుంటుందనిపించేది.

...అలా, తెలీకండానే అతని మనసు ఊహాలు అల్లేసేది. తరవాత కొంతసేపటికి తృళ్ళిపడ్డట్టు అసలు విషయాన్ని మరిచి రామలక్ష్మిగొడవలో పడ్డానని ఆత్మనిందకి దిగేవాడు!

ఇలాటి ఆత్మ పరిశోధన రామనాథం చాలా సార్లు చేసుకున్నాడు. ఒక నాటి, ఇలాటి విశేష ఘడియల్లో రామనాథం తనగది కిటికీముందు నిలబడి తోటలో చీకటి పడటం గమనిస్తున్నాడు యాధాలాభంగా. దూరంగా తిన్నెమీద ఎవరో కూర్చుని వుండటం రామనాథం కళ్లపడ్డది. పరీక్షగా చూచాడు—రామలక్ష్మి!

ఇంట్లో, లోపల ఎక్కడో యశోదమ్మగారు, పనివాళ్లూ తప్పితే మరెవరూ లేరు—సీతాపతి ఇంకా కాలేజీనుంచి ఇంటికి రాలేదు. సీనయ్యగారు ఎక్కడికో వెళ్లాడు.

రామనాథానికి గుండె గొంతుదాకా ఎగదట్టి నట్టయింది. అక్కడికి వెడదామనిపించింది. కాని కాళ్ళు చచ్చుపడ్డట్టనిపించింది. ధైర్యం చిక్కబట్టి అడుగుముందుకి వేశాడు. రామలక్ష్మి ముందుకి చేరేదాకా ఎలా నడవగలిగాడో రామనాథానికే తెలీదు.

యాధాలాభంగా ఉన్న రామలక్ష్మికి ఎదురుగా రామనాథం కనబడేసరికి ఒక్కసారి కళవిళపడ్డది. వెంటనే నవ్వుముఖం పెట్టబోయింది. కాని, ఆమెకళ్ళు నీళ్ళతోనిండి ఉండటం గమనించాడు రామనాథం.

ఏమి మాట్లాడాలో రామనాథానికీ తోచలేదు. "ఏడుస్తున్నావా? రామలక్ష్మి!" అన్నాడు తెప్పరిల్లి, ఎలాగైతేనేం.

తన గుట్టు బయటపడ్డట్టు బాధపడ్డది రామలక్ష్మి. "అవును. ఎందు కేడుస్తున్నానో కూడా వింటారా?" అంది నిండుకన్నీళ్లతోనే. రామనాథం తనని బహువచనంతో సంబోధించడం విని గాభరా పడ్డాడు.

రామలక్ష్మి నవ్వుతూ, "జీవితమంతా ఒకటే నవ్వులూ, ఒకటే వేళాకోళాలూ, వెక్కిరింతలూ

అయితే విసుగ్గా వుంటుంది. అందుకని అప్పుడప్పుడు తీరిగ్గా కూర్చుని ఇలా ఏడుస్తూ ఉంటాను. మీరు కూడా ప్రాక్టీస్ చెయ్యండి! చాలా బాగుంటుంది!" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

ఇన్నాళ్ళ తరవాత తీరిగ్గా మంచంమీద పడుకుని ఆలోచిస్తున్నా ఈ మాటలకి తను చెప్పతగ్గ సరైన సమాధానం స్ఫురించటం లేదు రామనాథానికి. కాని, ఇప్పు డనుకుంటున్నాడు—అంతటితో తను రామలక్ష్మిమీద కత్తికట్టి ఉంటే చాలా బాగుండే దని!

రామలక్ష్మి నవ్వులో, అల్లరితనంలో ఏదో పెద్ద మోసముందనుకున్నాడు రామనాథం. రామలక్ష్మి నలుగురిలో ప్రదర్శిస్తున్న చురుకుతనం, మాటకారితనం అంతా ఉట్టి డాంబికమనీ... బైటికి చెప్పటానికి వీలుకాక మనసులో కప్పిపెట్టుకుంటున్న తన కోర్కెలనీ, వ్యథనీ బైటివాళ్ళకి తెలియకండా మభ్యపెట్టటానికి అవలంబిస్తున పటాటోపమనిన్నీ స్థిరంగా నిర్ణయించుకున్నాడు.

ఇలా, రామనాథానికి తెలియకండా అతని మనసులో రామలక్ష్మి తిష్ఠవేసుకూర్చుంది! దినమంతలోనూ ఏ కొద్ది క్షణాలో తప్పితే మంచిగానో చెడుగానో అతని ఊహలు రామలక్ష్మివైపు మొగ్గేవి.

రామలక్ష్మి చర్యలు జాగ్రత్తగా గమనించటం మొదలుపెట్టాడు రామనాథం. నలుగురిలో ఉన్నప్పటి సంతోషం రామలక్ష్మిలో ఒంటరిగా వున్నప్పుడుండేది కాదు. అలా, ఒంటరిగా ఉన్నప్పుడు రామలక్ష్మి పడే విచార మేమిటి?—రామనాథం మనస్సు పరిపరివిధాల ఆలోచించేది.

తరవాత, రామలక్ష్మి ప్రవర్తనలో కూడా చాలా మార్పు కనిపెట్టాడు రామనాథం. వెనకటి పరిహాసం చాలవరకు తగ్గిపోయింది. తనూ రామలక్ష్మి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ తోటలో చాలా సాయంత్రాలు గడిపారు. రామలక్ష్మితో మాట్లాడుతున్న అనుక్షణం ఆమెను జాగ్రత్తగా గమనించాడు రామనాథం. అవి దేదో ఒక భయంకరమైన హద్దుపైన నిలబడి దాన్ని దాటాలని ఉరకలువేస్తూ దాటలేక తబ్బిబ్బవుతున్నట్లనిపించేది రామనాథానికి.

తను చేయూత నివ్వగలవాడ ననుకోవటానికి రామనాథానికి అట్టే కాలంపట్టలేదు!

ఒకనాటి సాయంత్రం కాలేజీనుంచివచ్చి, తోటలోకి వెడుతూ రామనాథాన్ని కూడా ఆహ్వానించింది రామలక్ష్మి! బైటపడటానికి కిదే సమయమన్నట్లు అతని మనస్సులో ఊహలు కలవరం ప్రారంభించినై.

మాట్లాడకండా ఇద్దరూ ఒకరి సరస నొకరు తోటలో గడ్డి ఒత్తుగా ఉన్నచోటికి నడిచారు. "ఏదో దీర్ఘాలోచనలో పడ్డట్టున్నారే!" అంది రామలక్ష్మి నవ్వుతూ, కూర్చుంటూ.

రామనాథం కంగారుగా "అబ్బే...ఏమీ లేదు" అంటూ రామలక్ష్మి కళ్ళల్లోకి చూశాడు.

ఆమె తీరు, తన మనస్సులోఉన్న ఊహలు గ్రహించినట్లు, బైటికి చెప్పమని ప్రేరేపిస్తున్నట్లూ, అనిపించింది రామనాథానికి. ప్రయత్నంమీద నోట్లో మాట దాచుకోగలిగాడు!

"బహుశా, నన్నేమైనా తిట్టుకుంటున్నా రనుకుంటాను!" అంది రామలక్ష్మి.

"నీ కిష్టమైతే మనం వివాహం చేసుకుందాం"

రోజుల తరబడి ఆలోచించి గుదికూర్చిన ఈ నాలుగుమాటలూ ఎలా అనేశాడో రామనాథానికే తెలీదు! కాని వెంటనే విచారపడ్డాడు—"నిన్ను దూషించటం లేదు; భూషిస్తున్నాను..."అంటూ ఒక చిన్న ఉపోద్ఘాతం తరవాత ఈమాటలు అని ఉంటే బాగుండేదని! రామలక్ష్మి తన మాటలు ఎలా తీసుకుంటుందోనని గుండెల్లో దడప్రారంభమైంది. ఆమె ముఖంవైపు చూడలేకపోయాడు. చూచినా కళ్ళు చీకట్లు కమ్మి ఆమె కనిపించటంలేదు! నోరు జారినందుకు తనని తానే నిందించుకోవటం మొదలు పెట్టాడు రామనాథం.

రామలక్ష్మి చాలా సాదాగా "...కాని, నాకలాటి అభిప్రాయ మేమీ లేదు; ఇకముం దెప్పుడూ ఇలాటి ప్రస్తావన తేవద్దు" అంది!

రామలక్ష్మి ఇలా మాట్లాడకండా నాలుగు తిట్లూ, పదివత్తి పొడుపుమాటలూ మాట్లాడితే రామనాథం ఆశ్చర్యపడకండా అర్థంచేసుకోగలిగేవాడు! రామలక్ష్మి అలంకార రహితంగా మాట్లాడగా తను విన్నది ఆ ఒక్కసారి మాత్రమే!

రామనాథం చాలా ఘోరమైన తప్పిదం చేసినట్లు బాధపడటం మొదలుపెట్టాడు. తన గుట్టంతా బయటపడిపోయినట్లు, తనిప్పుడు రామలక్ష్మి చేతులో కీలుబొమ్మ అయిపోయినట్లు బాధపడటం మొదలుపెట్టాడు. కాని, ఇప్పుడైతే నిర్భయంగా అంటాడు. రామలక్ష్మిలయలు పన్ని తనచేత ఆమాటలు అనిపించింది—అని!

ఎక్కడికైనా వెళ్ళిపోదా మనిపించింది రామనాథానికి. కాని, అది అసలు అనుమానానికి దారితీస్తుందని, ఒంట్లో బాగా లేదని తన గదిలో ముసుగు బిగించిపడుకున్నాడు.

రామలక్ష్మి మాత్రం ఏమీ జరగనట్టు తన సహజధోరణిలో నవ్వుతూ కేరింతాలు కొడుతోంది. ఆనవ్వు మాటున ఎన్ని రహస్యాలు దాచుకోగలదో!—అనిపించింది రామనాథానికి. దుప్పటిలోపలి రామనాథం ముఖం కోపంతో జేవురించింది.

రాత్రి బాగా ప్రొద్దుపోయింది. ఇంట్లో అంతా నిద్రపోతున్నారు. రామలక్ష్మి, సీతాపతి మాత్రం దీపం ముందు కూర్చున్నారు పరీక్షచదువుకని. పెద్దవాళ్ళని జోకొట్టటానికైతే అంత సేపూ పాఠాలు చదివారుకాని, వాళ్ళు ఆదమరచి నిద్రపోగానే వీళ్ళమాటలు వేరువిధంగా మారినై—

"సీతా! మామయ్యతో చెప్పలేదుకదూ?"

సీతాపతి మౌనంగా తలవంచుకు కూర్చున్నాడు.

"మామయ్యతో నేనే చెప్పేస్తాను. మరేమీ అనడు...అంతా నీ భయమే కాని......నాకు తెలుసు"

"ఒద్దు...రాముడూ! నామాట విను...నేనే చెప్తాను" అన్నాడు సీతాపతి తడబడుతూ.

"ఇక్కడికి సవా లక్షసార్లయింది నువ్వు చెప్తాననటం! మామయ్య అడిగిందల్లా ఇచ్చే ధర్మాత్ముడు! అలాటి వాడి దగ్గిర కెళ్లి నా కిది కావాలని చెప్పలేకపోతున్నావు, రేపు మామయ్యతో అంతా చెప్పిసంతోషంతో ఒప్పుకునేట్టు చేస్తాను......చూడు!"

"రాముడూ!" అన్నాడు సీతాపతి భయంతో ఒణుకుతున్నట్టు.

ఈ సంభాషణంతా చాటుగా వింటున్న రామనాథానికి ఇదంతా కలేమో ననిపించింది. దూరదూరంగా ఉంటున్న సీతా ఇంత ఘనుడా అని ఆశ్చర్యపోవటం మొదలుపెట్టాడు.

రామలక్ష్మి తననంత అవమానించటానికి కూడా కారణం అర్థమైందనుకున్నాడు రామనాథం.

రామలక్ష్మికి సరైన సమాధానం చెప్పతగ్గ అదను దొరికినట్టనిపించింది, రామనాథానికి. చల్లగా వాళ్ళ ఎదటికి వచ్చి "ఎవరు చెప్పాలని మీ తర్జన భర్జన అనవసరం. మీ ఇద్దరితరఫున ఆ శ్రమ నేను పడతాను-పెద్ద నాన్నకు నేనే చెపుతునులే" అన్నాడు ఆవేశంతో.

రామనాథం ప్రవేశంతో సీతాపతి వణికిపోతున్నాడు. రామలక్ష్మి తన్ను తాను సంబాళించుకుని "మాకోసం మీరు పడబోతున్న శ్రమకి మా ఇద్దరి తరఫున కృతజ్ఞత...మా పెళ్ళి పెద్దరికం మీకే దక్కేట్టు తప్పకుండా చూస్తాం. మరొక్క విషయం—మా విషయం అలా వుంచి, మీ విషయం మామయ్యతో చెప్తానేమో నని ఏ నుయ్యో, గొయ్యో, చూచుకునేరు! పెళ్ళిపెద్దలు మీరుండటం ముఖ్యం!" అంది మహా వక్తలాగా.

సీతాపతి ఇద్దరినీ చూస్తూ నిలబడ్డాడు!

"ఊహించనైనా ఊహించరాని ఇలాటి సంబంధం కలిగివున్నందుకు నెరుపైనా లేకపోవటం విచారకరం!" తను అనాలనుకున్న ఈ నాలుగు ముక్కలూ అని గదిలోకి బయలుదేరాడు.

"మా సంబంధం మీరైనా సవ్యంగా ఊహించలేకపోయారే అనే మా విచారం!" తిరోగమిస్తున్న సైనికుడి పైకి బాంబులాగా విసిరింది మాటల్ని రామలక్ష్మి!

* * * *

రామనాథానికి ఎప్పుడు కునుకుపట్టిందో తెలీదు. నిద్రలేచేసరికి బారెడు పొద్దెక్కింది. తలంతా నాదుగానూ, ఒళ్ళంతా భారంగానూ ఉంది. రాత్రంతా ఒక పీడకల అనిపించింది.

లేచి కూర్చుని టేబులువైపు చూచాడు. పుస్తకం కింది ఉత్తరం రాత్రి జరిగిందంతా యథార్థమని ఋజువు చేస్తోంది. టూత్ బ్రష్, సబ్బు, తువ్వాలు పుచ్చుకుని నీళ్ళగదికి బయలుదేరాడు. ఆ ఉత్తరం సీనయ్యగారికి అందించితీరాలని పళ్లుతోముకుంటూ మరొకసారి అనుకున్నాడు రామనాథం.

మళ్లీ ఏదో అనుమానం తగిలి గదికి బయలు దేరాడు. తలుపులు తీసిఉన్నై. ఆదరాబాదరా రామనాథం గదిలో ప్రవేశించాడు.

రామలక్ష్మి పుస్తకం కింది ఉత్తరంతీసి జేబులో దాచేసింది. "పోస్టుబంట్రోతు పని నేను చేస్తాను!" అని నవ్వటం ప్రారంభించింది.

రామనాథానికి ఆ నవ్వు చాలా వెకిలిగా కనిపించింది. తన ఉత్తరం తన కివ్వమని మరి మరి అడిగాడు, అంతకంటే చేసేదిలేక!

"రామనాథంగారూ! మీరు ఈపాటి దానికి సంసిద్ధులని నేను ఇంతవరకు నిజంగా నమ్మలేదండీ... వస్తా!" అని మాయమైంది రామలక్ష్మి.

రామలక్ష్మి ఆ ఉత్తరం ఇచ్చితీరుతుందన్న నమ్మకం కలిగిన దగ్గరనుంచీ సీనయ్యగారు ఆ ఉత్తరాన్ని ఎలా తీసుకుంటాడన్న మథన ప్రారంభమైంది రామనాథానికి. రామలక్ష్మికి చాలా నమ్మకముంది— మరిదితో తన వివాహానికి మామగారు అభ్యంతరం చెప్పడని! కర్మంకాలి, ఆయనే గనక అలా ఒప్పుకుంటే తన ఉత్తరం చూచి ఎంత అసహ్యించుకుంటాడు? రామనాథానికి ఈవిషయం తల్చుకున్నప్పుడల్లా గొంతుతడి ఆరిపోయేది!

ఈ చెఱినుంచి బైటపడటానికి రామనాథానికి ఒకటేమార్గం కనపడింది—సాధ్యమైనంత త్వరలో తనిక్కడినుంచి చల్లగా నిష్క్రమించటం. తను సెలవలకి ఇంటికి వెడతాడని ఇంట్లోవాళ్ళందరికీ తెలుసు. రెండోకంటివాళ్ళకి తెలియకండా రామనాథం సామనులన్నీ సర్దేశాడు. ఇంతకాలం వాళ్లింట్లో ఉంటూ, వాళ్ళ అన్నం తింటూ సీనయ్యగారికి చెప్పిపోకపోవటం ఎంతమాత్రం బాగుండదు. పైగా అది లేనిపోని అనుమానాలకి దారితీస్తుంది కూడాను.

కాని, ఈ పిల్లికి గంట కట్టట మెలాగో తెలియక సతమతమయ్యాడు రామనాథం. ఎన్నడూ కోపమంటూ ఎరగని మనిషి. సీనయ్యగారు. మరి ఒకవేళ ఆయనకి కోపమే వచ్చివుంటే! ఏమైనా సీనయ్యగారికి చెప్పక తప్పదు.

హఠాత్తుగా సీనయ్యగారే రామనాథం గదిలో అడుగుపెట్టేసరికి భయంతో రామనాథం గుండె దిగజారిపోయింది. దీనికితోడు రామలక్ష్మికూడా గదిలోకి ప్రవేసించింది.

నరాలు పట్టుతప్పి కుప్పగా కూలిపోతానేమోననిపించింది రామనాథానికి.

"మే మెవరం చెప్పినా ఆగేట్టు లేరు రామనాథంగారు...మాటామల్లే సర్దేశారు మామయ్యా!" అంది రామలక్ష్మి తేలిగ్గా పంపటం ఇషంలేనట్టు!

"ఎక్కడికి వెడతాడమ్మాయ్!...ఇంత అక్కర ముందు పెట్టుకుని!"

తనని తరవాత దుర్భాషలాడటానికి ఈ సంభాషణ ఉపోద్ఘాతమేమోనని భయపడ్డాడు రామనాథం. సీనయ్యగారు కూడా కుఱ్ఱవాడిలాగా వేళా కోళానికి దిగటం అసహ్యమనిపించింది రామనాథానికి.

"మరి పిలుపు తక్కువయిందేమో!" అంది రామలక్ష్మి రామనాథం కళ్ళల్లోకి చూస్తూ.

సీనయ్య గారు నవ్వాడు...

"పెద్దరికం వహించవలసినవాడు రామనాథానికి అలక ఏమిటి? ఐనా, ఎందుకైనా మంచిది— రామనాథం! రామలక్ష్మికి, సీతాపతికీ వివాహం జరగబోతోంది త్వరలో" అన్నాడు సీనయ్యగారు తను ఇన్నాళ్లూ వాళ్ల ఉద్దేశ్యంకోసం ఎదురుచూస్తూ కూచున్నట్టు. "నువ్వు ఇప్పుడప్పుడే ఎక్కడికీ వెళ్ళటానికి వీలులేదు. మీ వాళ్ళు కూడా ఇక్కడికే వస్తారు" అన్నాడు సీనయ్యగారు మళ్ళీ.

రామలక్ష్మి సీనయ్యగారివైపొకసారి చూచింది. సీనయ్యగారు తన మాటలు బాగా వప్పజెప్పాడని చూపులతోనే అభినందిస్తోం దనుకున్నాడు రామనాథం.

"మీ ఉత్తరం నా దగ్గరే వుంది. ఈ శుభకార్యమింత త్వరలో జరగబోవటానికి మీ శాయశక్తులా మీరు పాటుపడ్డందుకు పెళ్ళి అవగానే మీ ఉత్తరం మీ కిచ్చి ధన్యవాదా లర్పించుకుంటాం!" నాటకంలో సంభాషణ వప్పగించినట్టు ఇంత వాక్యం ఒక్కపెట్టున అని నిష్క్రమించింది రామలక్ష్మి.

రామనాథం ముఖం కందగడ్డలాగయింది. మామ కోడళ్ళిద్దరూ జరగబోయే వివాహాన్ని, ధర్మశాస్త్రం ఒప్పకపోయినా, "శుభకార్యం" అంటూ మురిసిపోతూ మాట్లాడటం అసహ్య మనిపించింది రామనాథానికి. కాని పైకి అనలేకపోయాడు.

సీనయ్యగారు రామనాథం సందేహం గుర్తించినట్టుసాలోచనగా ముఖంపెట్టి, "ఇష్టంలేని వివాహంచేసి ఒక కొడుకును పోగొట్టుకున్నాను... ఇష్టమైన వివాహంచేసి ఈ కొడుకునైనా రక్షించుకుంటాను" అన్నాడు. ఈ వాక్యం తనకు బాగా పరిచయమైనట్టు చాలా పొందికగా అన్నాడు సీనయ్యగారు.

సీనయ్యగారిని ఒక క్షణంపాటు సానుభూతితో చూచాడు రామనాథం. కాని, మళ్లీ అతనిముఖం ఎఱ్ఱబారింది—"పోయిన కొడుక్కి, తనకి జరిగిన వివాహం ఇష్టం లేకపోవటానికి ఈ సంబంధమే నేమో కారణం!" అందా మనుకున్నాడు రామనాథం.

కాని, ధైర్యం చాలింది కాదు...